సాక్షి ఆదిలాబాద్

సోమవారం : 25 : ఆగస్టు : 2025



మితిమీరితే అనర్థమే..!

సాగులో మితిమీరిన ఎరువులు వినియోగిస్తే అనర్థాలు తప్పవు. భూసారం కోల్పోవడంతో పాటు అన్నదాతపై పెట్టుబడి భారం పెరగనుంది.

8లో▶



ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

గోలేటిలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఫైనల్‌లో ఆదిలాబాద్ మహిళా జట్టు, వరంగల్ పురుషుల జట్టు విజేతలుగా నిలిచాయి.

8లో▶

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ



పూజల్లో పాల్గొన్న ఎస్పీ, కుటుంబ సభ్యులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని మెస్రం వంశీయులు ఘనంగా సన్మానించారు. ఇందులో ఉట్నూర్ సీఐ ప్రసాద్, ఎస్సై సాయన్న, మెస్రం వంశీయులు వెంకట్‌రావ్, ఆనంద్‌రావ్, తదితరులున్నారు.

మహదేవ్ ఆలయ సందర్శన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ గ్రామంలో గల హరహర మహదేవ్ ఆలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ దర్శించుకున్నారు. అలాగే కొండపై ఉన్న శివుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వామన్‌మహరాజ్, శ్యాంప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



పంట నష్టం పరిశీలిస్తున్న రామన్న

ఆదిలాబాద్‌రూరల్: పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మండలంలోని అంకోలి, తంతోలి, లింగుగూడ గ్రామాల శివారులో వరదతో నష్టపోయిన పంట చేలను ఆదివారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగే వరకు పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. ఇంద్రవెల్లి సభలో రైతులకు ప్రీమియం కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని మండిపడ్డారు. ఆ సభలో ఇచ్చిన ప్రతీ హామీని పూర్తి చేయకుంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్, నాయకులు జగదీష్, ప్రహ్లాద్, రాజు, సతీష్, పరమేశ్వర్, తదితరులున్నారు.

పదోన్నతుల జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ ప్రమోషన్లలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల జాబితాను డీఈవో ఖుష్బూ గుప్తా ఆదివారం విడుదల చేశారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందే అభ్యర్థుల 1:1 నిష్పత్తి, ఖాళీలను ప్రకటించారు. జిల్లాలో 131 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఆయా పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు లేకపోవడంతో 75 మందికి పదోన్నతి లభించనుంది. సోమవారం వెబ్ ఆప్షన్ ఇవ్వనుండగా, మంగళవారం పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కానున్నాయి.

సీపీఎస్ రద్దే లక్ష్యం



మద్దతు తెలుపుతున్న జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయడమే పీఆర్టీయూ తెలంగాణ లక్ష్యమని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా బాధ్యులు హాజరయ్యారు. దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు ప్రకటించారు. సంఘీభావం తెలిపిన వారిలో వివేక్ భవాని, మడావి కొండు, దాసరి బాబన్న తదితరులున్నారు.

విద్యుత్ కాంట్రాక్టర్ల నిరసన



నినాదాలు చేస్తున్న కాంట్రాక్టర్లు

ఆదిలాబాద్‌టౌన్: తమకు బిల్లులు వెంటనే చెల్లించాలని విద్యుత్ కాంట్రాక్టర్లు ఆదివారం ఎస్ఈ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు ప్రకాశ్ జాదవ్ మాట్లాడుతూ, నెలల తరబడి బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అలాగే మూడేళ్లుగా తమను జేఏఓ వేధింపులకు గురిచేస్తున్నట్లుగా ఆరోపించారు. ఆయనను వెంటనే సబ్ డివిజన్ కార్యాలయం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందులో కాంట్రాక్టర్లు రాము, అశోక్, రవీందర్‌రెడ్డి, నర్సింగ్, హరిచరణ్, రాథోడ్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



మరణించినా.. జీవించేలా

సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు పెద్దలు. కంటి చూపు లేని వారి బతుకులు పరాధీనం. అంధకారం వారికి శాపం. అయితే మరణానంతర నేత్రదానం అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జిల్లా వ్యాప్తంగా నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పీహెచ్‌సీల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

– ఆదిలాబాద్‌టౌన్

- నేత్రదానానికి ముందుకు రావాలి
- నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు
- వైద్యశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు



జిల్లాలో నేత్రదాన నమోదు కేంద్రాలు..

నమోదు కేంద్రం	సంప్రదించాల్సిన అధికారి/సిబ్బంది	సెల్ నంబర్
రిమ్స్	ప్రభాకర్	90004 84201
	లింగేష్	98665 16995
	విజయ్ కుమార్	92477 50829
శేషన్న చెన్నవార్ కంటి ఆస్పత్రి	రంజిత్	99634 78753

జిల్లా అంధత్వ నివారణ సంస్థ లెక్కల ప్రకారం జనాభాలో ఎక్కువ మందికి కంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి. ఏటా అంధత్వ నివారణ పక్షోత్సవాల్లో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో నేత్రాలు సేకరించడంతో పాటు, కంటిశుక్లాల ఆపరేషన్లు లక్ష్యంగా పెట్టుకుంటారు. ఏటా జిల్లాలో 10వేల మందికి నేత్ర శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. విద్యార్థులు సైతం కంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ఇలాంటి వారి కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టింది. అవసరం ఉన్నవారికి అద్దాలను ఉచితంగా పంపిణీ చేసింది. పలువురికి శస్త్ర చికిత్సలు సైతం నిర్వహించారు.

అంధత్వానికి కారణాలెన్నో..

నేత్ర సమస్యల్లో ప్రధానమైంది కార్నియా అంధులుగా మారడం. ఇందులో యువత, చిన్న పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. విటమిన్–ఏ లోపం, పౌష్టికాహార లేమి, ప్రమాదాలు, గాయాలు, శస్త్ర చికిత్స ద్వారా వచ్చే ఇన్‌ఫెక్షన్లు కార్నియా అంధత్వానికి కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. 40 ఏళ్లు దాటాక కళ్లలో శుక్లాలు వస్తాయి. వీటికి శస్త్ర చికిత్సల ద్వారా చూపువస్తుంది. అయితే కార్నియా అంధత్వానికి నేత్రాల కార్నియా మార్పిడే మార్గం. చనిపోయిన వారి నుంచి సేకరించిన కార్నియాలను అంధులకు అమర్చడం ద్వారా వారికి చూపు ప్రసాదించవచ్చు. అయితే అవగాహన లోపం, మూఢనమ్మకాలతోనే చాలా ప్రాంతాల్లో నేత్ర దానానికి ముందుకు రావడం లేదు.

వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన..

నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. నేత్రదానం కేవలం చనిపోయిన వారి నుంచి మాత్రమే సేకరిస్తారు. వారి జ్ఞాపకార్థం వారి బంధువులు, కుటుంబ సభ్యుల సమ్మతితో చనిపోయిన 7గంటల లోపు నేత్రాలు సేకరించాల్సి ఉంటుంది. బతికున్న సమయంలో నేత్రదా నంకు సంబంధించిన పత్రాన్ని నింపి ప్రభుత్వ ఆస్పత్రులు, ఐ బ్యాంకుల్లో ఇవ్వాల్సి ఉంటుంది. నేత్రాల సేకరణ కేవలం 20 నుంచి 30 నిమిషాల్లో పూర్తవుతుంది. హెచ్ఐవీ, కామెర్లు, సిఫిలిస్, రేబీస్ వంటి వ్యాధిగ్రస్తులు నేత్ర దానానికి అనర్హులుకారు. ఇక మిగతా వారిలో ఏ వయస్సు వారైనా, కంటి అద్దాలు ధరించే వారైనా మధుమేహం, రక్తపోటు బాధితులైనా నిరభ్యంతరంగా నేత్రాలు దానం చేయవచ్చు.

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు

మనిషికి జీవితకాలం ఒక్కటే.. కళ్లకు మాత్రం రెండు జీవిత కాలాలు. చనిపోయినప్పటికీ కళ్లతో అంధులకు వెలుగునిచ్చే అవకాశం నేత్రదానంతోనే సాధ్యం. ఈ మేరకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం నుంచి అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

‘సహకార’లో ఉత్కంఠ

- పదవీకాలం పొడిగించినా.. కొనసాగింపుపై సందిగ్ధం
- పనితీరు సక్రమంగా ఉంటేనే అనుమతి
- నిబంధనలు విధించిన ప్రభుత్వం
- సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లలో అసంతృప్తి

జిల్లాలో..

మొత్తం సహకార సంఘాలు	28
డీసీసీబీ పరిధిలోనివి	23
ఎస్‌బీఐ పరిధిలోనివి	05
సభ్యత్వం కలిగిన రైతులు	30వేలు

కైలాస్‌నగర్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల గడువు ఈనెల 14వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో పదవీ కాలం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే నిబంధనల ప్రకారం ఉన్న సొసైటీలకు మాత్రమే వర్తిస్తుందని మెలిక పెట్టింది. ఈ మేరకు పది అంశాలను నిర్దేశిస్తూ పనితీరు పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. పదవీకాలం పొడిగింపుపై హర్షం వ్యక్తం చేసిన చైర్మన్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలతో డీలా పడిపోయారు. సర్కారు నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం సొసైటీల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

అన్నదాతకు అండగా..

మండల స్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు అందజేస్తూ సొసైటీలు వారికి అండగా నిలుస్తున్నాయి. ఇలాంటి వాటికి ప్రతీ ఐదేళ్లకోసారి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుంది. సొసైటీ పరిధిలోని రైతులు.. డైరెక్టర్లు, చైర్మన్లతో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. 2020లో ఎన్నికైన పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అయితే రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్లంతా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి విజ్ఞప్తి చేయడంతో పదవీకాలం ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ గడువు ఈ నెల 14తో ముగియడంతో మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటిసారి ఎలాంటి నిబంధనలు లేకుండా పదవీ కాలం పొడిగించిన ప్రభుత్వం ఈసారి మాత్రం నిబంధనల ప్రకారం ఉన్న వాటికి మాత్రమే వర్తింపజేయాలనే నిబంధన విధించడంతో సొసైటీల కొనసాగింపు సందేహంగా మారింది.

పనితీరు మెరుగ్గా ఉంటేనే..

తాజా నిబంధనల ప్రకారం పనితీరు మెరుగ్గా ఉంటేనే వాటి పాలకవర్గాల గడువు పొడిగింపు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం సొసైటీల వారీగా పది అంశాలతో కూడిన సమాచారం అందించాల్సిందిగా జిల్లా సహకార శాఖను ఆదేశించింది. సొసైటీ పరిధిలో పాత బకాయిల పరిస్థితి.. రుణాల తిరిగి చెల్లింపులు సక్రమంగా ఉన్నాయా, నిధుల దుర్వినియోగం ఏమైనా జరిగిందా.. జరిగితే వాటిపై ఎలాంటి విచారణ చేపట్టారు.. దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరంగా ఏమైనా చర్యలు తీసుకున్నారా.. సొసైటీ కార్యకలాపాలపై ఆడిట్ చేశారా.. చట్టపరమైన చర్యలకు సంబంధించిన పిటిషన్ ఏదైనా పెండింగ్‌లో ఉందా.. అనే తదితర వివరాలతో కూడిన సమాచారం పంపించాలని సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రంగంలోకి దిగిన ఆ శాఖ అధికారులు సొసైటీల వారీగా సమాచారం సేకరించారు. పనితీరును గుర్తించి వివరాలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. తదనుగుణంగా పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయనున్నారు.



తాంసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

పదవిపై ఉత్కంఠ..

ప్రభుత్వ తాజా నిబంధనలతో జిల్లాలో ఎంత మంది సొసైటీ చైర్మన్లకు పదవి గడువు పొడిగింపు దక్కుతుంది అనే దానిపై సర్వత్రా ఆసక్తినెలకొంది. సర్కారు నిర్ణయంపై పాలకవర్గాలతో పాటు వాటి పరిధిలోని రైతులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

నివేదిక అందజేశాం..

సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని సొసైటీల పనితీరుపై పది అంశాలతో కూడిన సమాచారం సేకరించాం. ఏ సొసైటీ పనితీరు ఏ విధంగా ఉందనే వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందించాం. తదుపరి ఆదేశాలకనుగుణంగా పొడిగింపుపై తగు చర్యలు తీసుకుంటాం.

– బి.మోహన్, జిల్లా సహకార అధికారి

క్రీడలతో ఆరోగ్యకర సమాజం

- ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా

ఆదిలాబాద్: క్రీడలతో ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కృతమవుతుందని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం నిర్వహించిన క్రీడా దినోత్సవ ర్యాలీని ఆమె ప్రారంభించారు. జ్యోతి వెలిగించి క్రీడాకారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలపై విస్తృత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నెల 23నుంచి 31వరకు క్రీడా దినోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టిందన్నారు. వీటిలో క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, క్రీడా శిక్షకులు రాజు, కబీర్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



పరుగు ర్యాలీలో పాల్గొన్న ట్రెయినీ కలెక్టర్ సలోని

నవరాత్రోత్సవాలు విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం హిందూ సమాజ్ ఉత్సవ సమితి లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

లబాన సంఘం జిల్లా కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: మధుర లబాన సమాజ నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మోహన్ సింగ్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా సాబ్లే అమర్‌సింగ్, ఉపాధ్యక్షులుగా పడవల్ పత్తు సింగ్, పడవల్ సర్దార్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా అజాడే కేవల్ సింగ్, కార్యదర్శిగా పడవల్ నానక్‌సింగ్, పడవల్ హుషార్ సింగ్, కోశాధికారిగా జామన్ సాతల్య, ప్రచార కార్యదర్శిగా సాబ్లే సంతోష్‌సింగ్, సభ్యులుగా చౌహాన్ ప్రేమ్‌సింగ్, రాంచందర్, సలహాదారులుగా మోహన్ సింగ్, కైలాస్‌సింగ్, సూరజ్, దిగంబర్, రైమల్, సకర్వాల్ గులాబ్‌సింగ్ ఎన్నికయ్యారు.

డుమ్మాలకు చెక్

- లెక్చరర్లకూ ఎఫ్ఆర్‌ఎస్
- ఇంటర్‌బోర్డు కసరత్తు
- వారం రోజుల్లో అమలులోకి..
- విద్యార్థులకు ఇప్పటికే మొదలైన ఫేషియల్ రికగ్నిషన్



విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ నమోదు చేస్తూ..

జిల్లాలో..

ప్రభుత్వ కళాశాలలు	13
ప్రథమ సంవత్సరం విద్యార్థులు	3,100
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	3,506
జూనియర్ లెక్చరర్లు	200

ఆదిలాబాద్‌టౌన్: డుమ్మా లెక్చరర్లకు చెక్ పెట్టేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు చర్యలు చేపడుతోంది. చాలామంది సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు. అయితే ఇప్పటికే పాఠశాలల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్‌ఎస్) విజయవంతం కావడంతో ప్రభుత్వ కళాశాలల్లోనూ అమలుకు చర్యలు చేపట్టింది. వారం రోజుల్లో అమలు చేయనున్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. కాగా శనివారం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ అమలులోకి తీసుకొచ్చారు. అయితే చాలాచోట్ల సర్కారు కాలేజీల్లో ప్రార్థన నిర్వహించకపోవడం, లెక్చరర్లు ఇష్టమున్నప్పుడు రావడం, వారికి నచ్చినప్పుడే వెళ్లడం పరిపాటిగా మారింది. ఇక నుంచి వారి ఆగడాలకు చెక్ పడనుంది. కళాశాలకు వచ్చిన లెక్చరర్లు బోధన చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇప్పటికే ప్రతీ తరగతి గది, కళాశాల ఆవరణ, ప్రిన్సిపాల్ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఇంటర్ బోర్డుకు అనుసంధానం చేసిన విషయం తెలిసిందే.

జిల్లాలో..

దూరప్రాంతంలో ఉన్న కళాశాలల్లో పనిచేసే కొందరు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సమయపాలన పాటించడం లేదు. దీంతో విద్యార్థులకు సక్రమంగా తరగతులు నిర్వహించని పరిస్థితి. వీటిపై దృష్టి పెట్టిన ఇంటర్ బోర్డు టీజీబీఐఈఎఫ్ఆర్‌ఎస్ అమలుకు సన్నద్ధమవుతోంది. లెక్చరర్లు తమ సెల్‌ఫోన్లలోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. కళాశాల చుట్టూ వంద మీటర్ల దూరంలో ఇది పనిచేస్తుంది. ఉదయం 9.20 గంటలకు, సాయంత్రం 4 గంటలకు హాజరు వేయాల్సి ఉంటుంది. సమయపాలన పాటించని అధ్యాపకుల వేతనాల్లో కోత విధించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదివరకు లెక్చరర్లు, విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు ఉండేది. కోవిడ్ తర్వాత పలు కళాశాలల్లో ఆ యంత్రాలు మూలనపడ్డాయి. అప్పటినుంచి హాజరు పట్టిక ద్వారానే అటెండెన్స్ నమోదు చేస్తున్నారు.

సొంత పనుల్లో బిజీ..

కొంత మంది లెక్చరర్లు కళాశాలల్లో పాఠాలు బోధించడం కంటే వారి సొంత పనుల్లోనే బిజీగా ఉంటున్నారనే విమర్శలున్నాయి. మారుమూల మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పర్యవేక్షించే వారు కరువవడంతో ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. కళాశాలకు ఆలస్యంగా రావడం, నిర్దేశిత సమయం ముగియకముందే ఇంటి ముఖం పట్టడం చేస్తున్నారు. పాఠాలు సక్రమంగా బోధించని లెక్చరర్లు మాస్ కాపీయింగ్‌కు ప్రోత్సహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారు. అయితే ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన వారు, డిగ్రీలో కనీసం పాస్ కాకపోవడం గమనార్హం.

ఎఫ్ఆర్‌ఎస్ యాప్‌లో..

ఇంటర్మీడియెట్ బోర్డు ప్రత్యేకంగా ఎఫ్ఆర్‌ఎస్ అమలుపై దృష్టి సారించింది. లెక్చరర్లు ఇక సెల్‌ఫోన్లలోనే హాజరు వేయాల్సి ఉంటుంది. మారుమూల మండలాల్లో ఉన్న కళాశాలలకు చాలా మంది సమయానికి వెళ్లడం లేదు. ఈ విధానంతో వీరి ఆగడాలకు చెక్ పడనుంది. లెక్చరర్లు ఏ సమయానికి వస్తున్నారు.. ఏ సమయానికి తిరిగి వెళ్తున్నారనే వివరాలు బోర్డు అధికారులతో పాటు డీఐఈవో కార్యాలయం, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌లో కనిపిస్తాయి.

కసరత్తు చేస్తున్నాం..

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రస్తుతం విద్యార్థులకు అమలు చేస్తున్నాం. వారం రోజుల్లో లెక్చరర్లు, సిబ్బందికి సైతం అందుబాటులోకి తీసుకురానున్నాం. ఇందుకోసం వివరాలు సైతం సేకరించాం.

– జాదవ్ గణేశ్‌కుమార్, డీఐఈవో

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

- డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి
- కేఆర్‌కే కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్
- 70 ద్విచక్ర వాహనాలు, 15 ఆటోలు, ఒక కారు స్వాధీనం


ఆదిలాబాద్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ సెర్చ్) నిర్వహించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో ఆదివారం వేకువజామున దాదాపు 200 మంది పోలీసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, 15 ఆటోలు, ఒక కారును తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే నార్కోటిక్ డాగ్ రోమా సాయంతో గంజాయి కోసం తనిఖీ చేయగా, ఓ ఇంట్లో మూడు మొక్కలు, 10 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. అలాగే ఓ షాపులో 29 క్వార్టర్ లిక్కర్ బాటిల్స్ లభ్యమైనట్లు తెలిపారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యత వివరించారు. వాటి ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపించాలని సూచించారు. కొత్తవారికి ఇల్లు అద్దెకు ఇచ్చే క్రమంలో సరైన విచారణ చేసుకోవాలని తెలిపారు. రాత్రి సమయాల్లో అనవసరంగా బయట తిరగరాదని, ఈవ్‌టీజింగ్, మహిళలను వేధించడం వంటివి నిర్వహించకూడదని అన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మావల సీఐ కర్రె స్వామి, పట్టణ సీఐలు బి.సునీల్ కుమార్, కె.నాగరాజు, కె.ఫణిదర్, ప్రేమ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎస్.చంద్రశేఖర్, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, రిజర్వ్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: మతాల మధ్య విద్వేషం, రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి గ్రామ వాట్సప్ గ్రూపులో ఇరువర్గాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడంతో ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొడవలకు దారితీసేలా వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడం, ఒక ప్రదేశంలో గుమి గూడడం, గ్రూపులు కట్టడం, స్టేటస్‌లు పెట్టుకోవడం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. అలాగే గ్రూపు అడ్మిన్‌లపై కూడా చర్యలుంటాయని పేర్కొన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని, ఎలాంటి విద్వేషాలు, రెచ్చగొట్టే వదంతులు నమ్మవద్దని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, గోపీకృష్ణ కోరారు. ఈమేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమురయ్యను హైదరాబాద్‌లో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:20 సవరించేలా చూడాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, నూతన పీఆర్సీ అమలు కోసం ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇందులో రాజ్‌కుమార్, దత్తాత్రి తదితరులున్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



క్లుప్తంగా

పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



ధ్వంసమైన పంట చూపుతున్న రైతు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన షేక్ అల్మియా అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను శనివారం రాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. సుమారు ఎకరానికి పైగా మొక్కజొన్నతో పాటు పసుపు, పత్తి పంటలను సైతం అడవిపందులు నాశనం చేశాయి. సంబంధిత అధికారులు పంట నష్టంపై అంచనా వేసి పరిహారం చెల్లించడంతో పాటు అడవిపందుల బెడద నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపను ఎడ్లబండ్లలో తరలిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాణహిత నది దయ్యాలమర్రి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్‌కు సమాచారం అందగా డెప్యూటీ రేంజ్ అధికారి రూపేష్, ఎఫ్‌బీవో సోఫియాబేగం అక్కడికి చేరుకుని కలప స్వాధీనం చేసుకున్నారు. ప్రాణహిత నది నుంచి ఎడ్లబండ్ల సాయంతో వేమనపల్లి అటవీ కార్యాలయానికి కలపను తరలించారు. కలప విలువ వివరాలు అధికారులు వెల్లడించలేదు.

చిరుత సంచారం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని అగర్గూడ, గుండెపల్లి పెద్దవాగు పరిసర అటవీ సమీప ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ క్షేత్రాధికారి అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. అటవీ ప్రాంత సమీపంలోని పంట చే లకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకుని గుంపులుగా వెళ్లాలని సూచించారు. చిరుతపులి కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు.

'సమస్యల పరిష్కారానికి నిరసనలు'



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కా రం, కొత్త గనుల సాధన కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీబీజీకేఎస్ నాయకులు తెలిపారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్‌లు మాట్లాడారు. వాస్తవ లాభాలు ప్రకటించి 35శాతం వాటా ను కార్మికులకు పంచాలని డిమాండ్ చేశారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.43 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని పేర్కొన్నారు. అన్ని డి మాండ్ల సాధనకు ఈ నెల 28న అన్ని జీఎం కార్యాయాలు, డిపార్టుమెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి అధికారులకు మెమోరాండం సమర్పిస్తామన్నారు. 29న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, సెప్టెంబర్ 2న చలో కొత్తగూడెం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, గొర్ల సంతోష్, నాయకులు తొంగల రమేశ్, వెంగళ కుమారస్వామి, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు



పేకాట ఆడుతున్న వారితో పోలీసులు

కౌటాల: మండలంలోని తాటినగర్ గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను ఆదివారం రాత్రి కౌటాల పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తాటినగర్ గ్రామంలో పేకాట ఆడుతున్న విశ్వేశ్వర్‌రావు, శంకర్, యం.రవి, కె.బాబురావ్, ఆర్.దివాకర్, జి.నాగేశ్, కె.మారుతి, జి.బాపు, సంతోష్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.10,300 నగదు, 5 సెల్‌ఫోన్లు, 52 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమానా గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై వాంకిడి పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం .. ఖమాన గ్రామ శివారులో పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించగా ఐదుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,820 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మితిమీరితే అనర్థమే..!



నెన్నెలలో వరి పంటకు ఎరువు వేస్తున్న రైతు

ఉమ్మడి జిల్లాలోని రైతులు పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులే లక్ష్యంగా యూరియా, డీఏపీ తదితర ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. రైతులు ఎక్కువగా పత్తి, వరి పంటలు సాగు చేస్తుండగా పంటల్లో ఎరువుల వాడకంపై వారికి అవగాహన ఉండటం లేదు. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సూచనలు పట్టించుకోకుండా ఇతర రైతులు వాడుతున్నారని అవసరం ఉన్నా, లేకున్నా ఎడపెడా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారడంతో పాటు పెట్టుబడులు పెరిగి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎరువుల యాజమాన్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

– మంచిర్యాలఅగ్రికల్చర్

- పెరిగిన రసాయనిక ఎరువుల వినియోగం
- నిస్సారమవుతున్న నేలలు
- పంటలకు చీడపీడల ముప్పు
- ఎరువుల యాజమాన్యంపై అవగాహన తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో 16.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా పత్తి పంట 10.30 లక్షల ఎకరాల్లో, వరి పంట 4.20 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్, రబీలో మొత్తంగా 3.80 లక్షల టన్నుల రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి భూములు 70శాతం ఉండగా 30 శాతం వరకు ఎర్ర, చౌడు తదితర నేలలు ఉన్నాయి.

ఎరువుల అధిక వినియోగం..

రైతులు పంటల ఎదుగుదలకు, దిగుబడులకు నాలుగైదు దఫాలుగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతోపాటు తెగుళ్ల నివారణ కోసం ఏళ్ల తరబడి రసాయనిక ఎరువులు, పురుగు మందులను పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారు. రైతులు దిగుబడి లక్ష్యంగా అవగాహన లోపంతో అవసరం లేకున్నా ఎరువులు, పురుగుల మందులు వాడుతూ ఆర్థికంగా, నేలనిస్సారంగా మారి నష్టపోతున్నారు. ఏటా ఉమ్మడి జిల్లా రైతులు ఎరువులకు రూ.340 కోట్ల వరకు, పురుగు మందులకు రూ.230 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల పచ్చని పొలాలు విషతుల్యమవుతుండగా, దిగుబడుల కంటే పెట్టుబడులే ఎక్కువై అప్పుల పాలవుతున్నారు. సేంద్రియ ఎరువులు తగ్గించి రసాయనిక మందులు వాడడం వల్లనే ఈ దుస్థితి నెలకొంటుంది.

సకాలంలో భాస్వరం..

మొక్కల వేరుల పెరుగుదల పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీనిని నాట్లు వేసే ముందు దమ్ములో లేదా నాట్లు వేసిన 15 రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాల్సి ఉంటుంది. నాట్లు వేసిన 15 రోజుల తరువాత ఈ ఎరువును పొలంలో చల్లుకున్నా ఉపయోగం ఉండదు. అయితే పొలంలో జింక్‌లోపం తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ ఎరువును సకాలంలో పైరుకు అందిస్తేనే మొక్కల ఎదుగుదల బాగుంటుంది.

పొటాష్‌తో రోగ నిరోధక శక్తి..

రోగ నిరోధక శక్తి పెంచడానికి, అవసరమైన పోషకాలను మొక్కలోని వివిధ భాగాలకు సరఫరా చేయడానికి పొటాష్ ఉపయోగపడుతుంది. పంటకు అవసరమయ్యే మొదటి దఫాలో 12 నుంచి 16 కిలోలు, రెండో దఫాలో 20 నుంచి 27 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలంలో చల్లుకోవాలి. దీనిని రెండు సమభాగాలుగా చేసి మొదటి దఫా, రెండో దఫా యూరియాతో కలిపి వేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చు.

మూడు విడతలుగా యూరియా..

వరిపైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతుంది. దీనిని మూడు దఫాలుగా పొలంలో చల్లుకోవాలి. నాట్లు వేసే ముందు, ఎదిగే దశలో, పొట్టకు వచ్చే దశలో నత్రజనిని అందించే ఎరువులు వాడుకోవాలి. నత్రజని పోషకాన్ని సరైన మోతాదులో పంటకు అందించేందుకు యూరియా వాడే విధానంపై రైతులకు అవగాహన ఉండాలి. ఎకరానికి 25 నుంచి 32 కిలోల నత్రజని అందించాలంటే 55 నుంచి 70 కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమ భాగాలుగా విభజించి చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన రీతిలో లేకుంటే అదనంగా 10 నుంచి 15 కిలోల వరకు యూరియా వాడొచ్చు. యూరియా అధిక వినియోగం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయి. యూరియా ఎక్కువైతే వరి మొక్కల ఆకుల్లో పత్రహరితం అధికంగా ఉండి పురుగులు దాడి చేస్తాయి. అగ్గితెగులు, ఆకుముడత తెగులు కూడా సోకే ప్రమాదం ఉంటుంది.



పత్తిలో ఎరువు వేసేందుకు సిద్ధం చేస్తున్న రైతు

మోతాదు మించొద్దు..

ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉన్నా అందులో నత్రజని లోపం అధికంగా ఉంది. చౌడు భూముల్లో జిప్సం, సల్ఫర్ లోపం ఉంది. పత్తి, వరి సాగు అధికంగా చేస్తుండగా దిగుబడికి రైతులు రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బ తింటుంది. రైతులు పంట మార్పిడి చేస్తే దిగుబడులు పెరుగుతాయి. సేంద్రియ ఎరువులు పశువుల పేడ, పచ్చిరొట్టి ఎరువులు, వర్మీ కంపోస్టు వేసుకుంటే నత్రజని లోపం అధిగమించవచ్చు.

– రాజశేఖర్, శాస్త్రవేత్త, ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం

రాయిపై గణపతి రూపం



స్వయంభూగా వెలసిన గణపతికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

- పూజలు చేసిన భక్తులు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామ శివారులో ఉన్న గుట్టపై రాతి గణపతి వెలిసింది. బండరాయి కింద గణపతి రూపం కనిపించడంతో గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేస్తున్నారు. ఆదివారం కోతల్‌గాం గ్రామస్తులు భజనలు చేస్తూ వాయిద్యాలతో వెళ్లి పూజలు నిర్వహించారు.

మొదటగా కాపర్లకు..

గ్రామస్తులు, భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న పశువులు, గొర్రెలు మేపేందుకు కాపర్లు గుట్టపైకి ఎక్కారు. ఆ సమయంలో వర్షం పడింది. వర్షానికి ఓ బండరాయి తడవక పోవడంతో సురేశ్ అనే వ్యక్తి అక్కడికి వెళ్లి తోటి కాపర్లను పిలిచాడు. బండరాయి వాన నీటికి తడవకపోవడంతో వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. వారికి బండరాయి కింద మరోరాయి గణపతి రూపంలో కనిపించింది. దీంతో గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. బండరాయి కింద గణపతి వెలసిందన్న విషయం తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు

- చాంపియన్లుగా ఆదిలాబాద్, వరంగల్ జట్లు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో కొనసాగుతున్న 71వ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆదిలాబాద్ మహిళ జట్టు విజేతగా నిలువగా పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా జట్టు విజయకేతనం ఎగురేసింది. ఆదివారం సెమీఫైనల్‌తో పాటు ఫైనల్ పోటీలు నిర్వహించగా క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఫైనల్‌లో ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు వరంగల్ జట్టుతో తలపడింది. పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా క్రీడాకారులు రంగారెడ్డి జిల్లాతో తలపడ్డారు.

పోటీలతో స్నేహభావం..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణతో వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్వోటూజీఎం రాజమల్లు, బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఒలంపిక్ అసోషియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో నిందితురాలి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: పెళ్లి సంబంధం ఉందని నమ్మబలికి కుటుంబ సభ్యులను బురిడీ కొట్టించి ఆ ఇంట్లోనే దొంగతనం చేసిన నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ చందవోలు హనోక్ వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన ఇందూరి చంద్రశేఖర్ తమ్ముడికి పెళ్లి సంబంధం చూస్తానని గొల్లగూడెం (కన్నాల)కు చెందిన పుల్లగొర్ల పుష్పలత ఈ నెల 22న ఫోన్ చేసి మంచిర్యాలకు రావాలని సూచించింది. దీంతో చంద్రశేఖర్ కుటుంబసభ్యులతో మంచిర్యాలకు వెళ్లాడు. పథకం ప్రకారం పుష్పలత చంద్రశేఖర్ ఇంటి తాళం పగులకొట్టి బీరువాలోని రూ.2 లక్షల విలువ చేసే రెండు తులాల బంగారు నక్లెస్, రూ.15 వేల నగదు అహరించింది. చంద్రశేఖర్ ఇంటికి వచ్చే సరికి బీరువా తాళం పగలకొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పుష్పలత తన ఇంటికి వచ్చి వెళ్లిన విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఆ కోణంలో విచారణ చేపట్టారు. ఆదివారం పుష్పలత శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే కమాన్ వద్ద ఉందని అందిన సమాచారంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై బండి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనోక్

చోరీ చేసి.. రైలెక్కి..!

- కాగజ్‌నగర్ పట్టణంలోని నగల షాపులో దొంగతనం
- వెండి ఆభరణాలతో రైలులో పరారైన మహిళలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా సమీపంలోని బ్రహ్మానందం అండ్ సన్స్ జ్యువెలరీ షాపులో గుర్తు తెలియని నలుగురు మహిళలు దొంగతనానికి పాల్పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం షాపులోకి వచ్చిన ముగ్గురు మహిళలు తమకు పట్టగొలుసులు కావాలని షాపు నిర్వాహకులను అడిగారు. దీంతో వారు పట్టగొలుసులను బయటకు తీసి చూపెట్టారు. ఈ క్రమంలో అదే గ్రూప్‌నకు చెందిన మరో మహిళ షాపులోకి వచ్చి తనకు మట్టెలు కావాలని అడిగి మిగితా మహిళల పక్కన నిల్చొంది. ఈక్రమంలో షాపు నిర్వాహకులను బురిడీ కొట్టించి సుమారు రూ.1.50 లక్షల వెండి ఆభరణాలను వారు దొంగిలించారు. షాపు యజమానికి అనుమానం వచ్చి నిలదీయగా తమకు ఏం తెలియదంటూ షాపు నుంచి వెళ్లిపోయారు. దీంతో షాపులోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా దొంగతనం బయటపడింది. వెంటనే షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. మహిళల జాడ కోసం పోలీసులు గాలించగా మహిళలు కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి వెళ్లిపోయినట్లు తెలిసింది. కాగా సీఐ ప్రేంకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై కాగజ్‌నగర్ పట్టణ సీఐ ప్రేం కుమార్‌ను సంప్రదించగా నలుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నామని, వరంగల్ జిల్లాకు చెందిన వారిగా అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.



నగల షాపులో చోరీకి వచ్చిన గుర్తు తెలియని మహిళలు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాలలో 1999 -2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో 25 ఏళ్ల తర్వాత విద్యార్థులంతా చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజ్ మహ్మద్, అనిల్, వేణుగోపాల్, కుమార్, అంజయ్య, సువర్చల, అనంతలక్ష్మీ, రుక్సాన, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాలో రెండిళ్లలో..

భైంసాటౌన్: పట్టణంలో చోరీలు కలకలం రేపుతున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. రెండురోజుల వ్యవధిలో రెండిళ్లలో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని భోకర్ తాలూకా దివిసి గ్రామానికి చెందిన జోగుదాండే మారుతి భైంసా పట్టణంలోని సాయినగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడం గమనించిన ఇంటి యజమాని ఆయనకు సమాచారమిచ్చాడు. దీంతో మారుతి వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. కాగా గీతానగర్‌లోని మరో ఇంట్లో అద్దెకు ఉంటున్న విశ్వనాథ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హంపోలి గ్రామానికి చెందిన విశ్వనాథ్ గురువారం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లాడు. శుక్రవారం ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన ఇంటి పక్కవారు అతనికి సమాచారమిచ్చారు. అతను అక్కడకు చేరుకుని చూడగా, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఈ ఘటనలో తులంన్నర బంగారం, 10 తులాల వెండి, రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.



సాయినగర్‌లోని ఇంట్లో చిందరవందరగా వస్తువులు

'ఆదివాసీ సభకు అనుమతి ఇవ్వకపోవడం సరికాదు'

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి సంఘీభావ వేదిక సభకు అనుమతి ఇవ్వకపోవడం ఆదివాసీలను అవమానించడమేనని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అన్నారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆదివారం మావల మండలం బట్టిసావర్‌గాం శివారు కుమురంభీంగూడలో నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలపై మారణహోమం సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు ఇందిరా, లలిత, గణపతి, మావల మండల అధ్యక్షుడు ముకుందరావు, నాయకులు రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఆదే శేఖర్ (ఫైల్)

దహెగాం: మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన ఆదే శేఖర్ (25) అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శేఖర్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను అడగ్గా వారు నిరాకరించారు. మనస్తాపానికి గురై ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి శేఖర్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఆదే లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులబాధతో..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని దేవల్‌నాయక్ తండాకు చెందిన చౌహాన్ అంకుష్ (42) అనే రైతు అప్పులు పెరగడంతో ఈనెల 11న పురుగుల మందు సేవించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పంట చేనులో పురుగుల మందు తాగగా, గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

తక్కువ మార్కులు వచ్చాయని..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన ఓ విద్యార్థిని మృతిచెందినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని మహారాష్ట్రలోని మాహోర్ తాలుకా బౌన్‌గూడకు చెందిన రాథోడ్ ప్రేరణ (16) శనివారం పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. తండ్రి అశ్విన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కడుపునొప్పి భరించలేక..



దోకె అజయ్ (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గుడిపేట శివారులోని దుబ్బపల్లిలో చోటు చేసుకుంది. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు.. దుబ్బపల్లికి చెందిన దోకె అజయ్(23) నెల రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ కరీంనగర్‌లోని చల్మెడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారం రోజులుగా భరించలేనంత నొప్పి ఉండటంతో 21వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.